నమస్తే తెలంగాణ

# నిజామాబాద్

5 | నిజామాబాద్, శనివారం 27 ఏప్రిల్ 2024 | NIZAMABAD




సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులతో కలిసి నామినేషన్ పత్రాలను స్క్రూటినీ చేస్తున్న రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి

## హామీలను ఎగ్గొట్టేందుకు
# కాంగ్రెస్ యత్నం

- అబద్ధపు మాటలతో వంచించిన రేవంత్ ప్రభుత్వం
- నియోజకవర్గంలో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నది..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- వన్నెల్(బీ), కిసాన్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం

బాల్కొండ, ఏప్రిల్ 26 : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మరిచిపోయిందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి, ఇప్పుడు 140 రోజులు దాటినా పట్టించుకోవడంలేదని, అడిగితే ఆగస్టు 15లోపు పూర్తిచేస్తామని చెబుతున్నాడని మండిపడ్డారు. అప్పటి వరకు ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల పూర్తవుతాయంటే హామీలు ఎగ్గొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ యత్నిస్తోందన్నారు. శుక్రవారం ఆయన వన్నెల్(బీ), కిసాన్‌నగర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన రోడ్‌షోలో వేముల మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంజూరైన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపివేయాలని ప్రయత్నం చేస్తోందని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఆ పనులు పూర్తయితే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అనేక అభివృద్ధి పనులు మంజూరు చేస్తూ తాను తీసుకొచ్చిన ప్రొసీడింగ్ కాపీలను తీసుకుని కలెక్టర్ వద్దకు వెళ్దామని, అవి బోగస్ పేపర్లంటే ఆ క్షణమే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, తన సవాల్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో మహిళలు, రైతులు, యువతను నమ్మించి మోసం చేసిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో సురుకు పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఏనాడూ మన మంచీ చెడులకు రాలేదని, ఎమ్మెల్సీగా ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. బీజేపీ అభ్యర్థి అర్వింద్ ఐదు రోజుల్లో పసుపు బోర్డు అని ఐదేండ్లయినా తీసుకురాలేదన్నారు. పంట సాగు తగ్గి పసుపు ధర పెరిగిందని, కానీ ఆయన చేసిన కృషి ఏమీలేదన్నారు. రాముడి పేరు, మోదీ పేరు మీద ఓట్లు అడుగుతున్న వారికి కర్రుకాల్చివాత పెట్టాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల మధ్యన ఉన్న మనిషి అని, 40 ఏండ్లుగా ప్రజా జీవితంలో ఉన్నారని తెలిపారు. బాజిరెడ్డిని గెలిపించి తనకు తోడుగా బలం ఇవ్వాలని కోరారు. ప్రజల పక్షాన హామీల అమలు కోసం కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల మెడలు వంచుతామన్నారు. ప్రచా రంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల



వన్నెల్(బీ)లో రోడ్‌షోకు హాజరైన గ్రామస్తులు

# ఇక ప్రచార హోరు

ముగిసిన నామినేషన్ల పర్వం

- స్క్రూటినీలో పలువురి దరఖాస్తులు తిరస్కరణ
- 'నిజామాబాద్'లో 10, 'జహీరాబాద్'లో 18 నామినేషన్లు ఔట్
- ఉపసంహరణకు 29 వరకు గడువు..
- ప్రధాన పార్టీల మధ్యే పోటీ
- క్షేత్ర స్థాయిలో దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్



జగిత్యాల జిల్లా బండలింగాపూర్‌లో శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

కంఠేశ్వర్, ఏప్రిల్ 26: లోకసభ ఎన్నికల్లో తొలి అంకం పూర్తయింది. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన శుక్రవారంతో ముగిసింది. నిజామాబాద్ లోక్‌సభకు దాఖలైన దరఖాస్తుల్లో పది మందివి తిరస్కరణకు గురికాగా, 32 మంది బరిలో ఉన్నారు. జహీరాబాద్‌లో 18 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, 26 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29 వరకు గడువు ఉంది. మే 13న పోలింగ్ జరుగనుండగా, ప్రధాన పార్టీలు ప్రచారంపై దృష్టి సారించాయి. అందరి కంటే ముందే బరిలోకి దిగిన బీఆర్‌ఎస్.. గెలుపే లక్ష్యంగా ప్రచారంలో దూసుకెళ్తున్నది. పార్టీ నాయకులు, కేడర్‌ను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తున్నది.

**10 నామినేషన్లు తిరస్కరణ..**

నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి దాఖలైన 90 నామినేషన్లలో 10 తిరస్కరణకు గురయ్యాయి. ఈ నెల 18 నుంచి 25 వరకు స్వీకరించిన నామినేషన్లను శుక్రవారం స్క్రూటినీ చేశారు. కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు , సాధారణ ఎన్నికల పరిశీలకురాలు ఎలిస్ వజ్ సమక్షంలో అభ్యర్థులు, పార్టీ ప్రతినిధుల ఎదుట నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. నిబంధనల ప్రకారం లేని 10 మంది నామినేషన్లను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. అభ్యర్థులు మిర్యాల్‌కర్ జయప్రకాశ్, పోతు అశోక్, బేగరి పోషం, మీసాల శ్రీనివాస్‌రావు, మొహమ్మద్ జమీల్, ఎండీ షాహెద్‌ఖాన్, కొండూరు గంగాధర్, పాణిగంటి రజితావాణి, చెంచుల అశోక్, వి.మహాతేజ దాఖలు చేసిన నామినేషన్లు చెల్లుబాటు కాలేదని కలెక్టర్ తెలిపారు. స్క్రూటినీ ప్రక్రియలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

**జహీరాబాద్‌లో 26 మంది..**

జహీరాబాద్ స్థానానికి దాఖలైన నామినేషన్లను శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి పరిశీలించారు. సాధారణ ఎన్నికల పరిశీలకుడు గోపాల్ జీ తివారీ, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆయా పార్టీల ప్రతినిధులు, స్వతంత్ర అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లను పరిశీలించారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు స్వీకరించిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా 40 మంది అభ్యర్థులు 68 నామినేషన్లు దాఖలు చేశారు. ఆయా నామినేషన్లను పరిశీలించగా, వివిధ కారణాలతో 14 మంది అభ్యర్థులు, 18 నామినేషన్లు తిరస్కరించినట్టు కలెక్టర్ తెలిపారు.

### ప్రచారంలో కారు జోరు..

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నది. నిజామాబాద్, జహీరాబాద్ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ప్రచార పర్వంలో దూసుకెళ్తున్నది. పార్టీ అభ్యర్థులు బాజిరెడ్డి గోవర్ధన్, గాలి అనిల్‌కుమార్ క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. కార్యకర్తలతో పాటు ప్రజలను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నిజామాబాద్‌లో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా, పార్టీ ముఖ్య నేతలు ప్రచార బాధ్యతలు చేపట్టారు. అటు జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జాజాల సురేందర్, గంప గోవర్ధన్ తదితరులు పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ పకడ్బందీగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు, ప్రత్యర్థి పార్టీల ప్రచారం ఇంకా ప్రారంభమే కాలేదు. బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పై పార్టీలోనే తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. అలాగే, ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెస్తానని బాండు రాసిచ్చి ఐదేండ్ల పాటు మోసం చేశారన్న ఆగ్రహం రైతుల్లో వ్యక్తమవుతున్నది. ఇక జగిత్యాల జిల్లాకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి నిజామాబాద్ జిల్లా నాయకుల నుంచి పూర్తి స్థాయి సహకారం అందడం లేదని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. అందుకే ప్రచారం ముమ్మరం చేయలేక పోతున్నారనే వాదన వినిపిస్తున్నది.

# రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

**మే 1,2వ తేదీల్లో పోలింగ్ సిబ్బందికి శిక్షణ**

కంఠేశ్వర్, ఏప్రిల్ 26: నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలీస్ వజ్ ఆర్ సమక్షంలో రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాలులో ఎన్నికల సంఘం నిబంధనలను అనసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్లతో పోలింగ్ నిర్వహణపై మొదటి విడుత శిక్షణ పూర్తి చేశారు. మే 1, 2వ తేదీల్లో రెండో విడుత శిక్షణకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రిజర్వ్ సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని, పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి,ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి,ఇతర పోలింగ్ సిబ్బంది ఉంటారని వివరించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఎన్ ఐ సీ అధికారి రవికుమార్, ఆర్డీవో రాజాగౌడ్, కలెక్టర్ ఏవో ప్రశాంత్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

**కామారెడ్డి జిల్లాలోనూ??**

కామారెడ్డి, ఏప్రిల్ 26 : కామారెడ్డి జిల్లాలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆధ్వర్యంలో రెండో విడుత ర్యాండమైజేషన్ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 913 పోలింగ్ కేంద్రాలకుగాను 20 శాతం అదనపు సిబ్బందితో ర్యాండమైజేషన్ పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, పోలింగ్ సిబ్బందితో కలిపి1093 బృందాలను కేటాయించినట్లు చెప్పా రు. 4,388 మంది పోలింగ్ సిబ్బందికి మొదటి విడుత శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు.



నిజామాబాద్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలీస్ వజ్ ఆర్‌కు వివరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

# కామారెడ్డి జిల్లా జడ్జి బదిలీ



జిల్లా జడ్జి శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయశాఖ ఉద్యోగులు

**సన్మానించిన న్యాయశాఖ ఉద్యోగులు**

కామారెడ్డి, ఏప్రిల్ 26 : కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎన్.శ్రీదేవి బదిలీ అయ్యారు. రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీకి సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్‌గా వెళ్తున్న సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయ శాఖ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటి నుంచి ప్రధాన న్యాయమూర్తిగా సేవలు అందించానని, తనవంతు బాధ్యతను పూర్తి చేశానని అన్నారు. ఉద్యోగులు, న్యాయవాదుల సహకారం మరిచిపోలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జిలు సుధాకర్, దీక్ష, పర్యవేక్షణ అధికారి శ్రీదేవి, న్యాయ శాఖ ఉద్యోగులు వెంకట్ రెడ్డి, సాయికృష్ణ, రమేశ్, రజిని, సంధ్య, సయ్యద్ రషీద్ అలీ, నాగేంద్ర, శ్రీధర్, చంద్రసేన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నించే గొంతుకను గెలిపిద్దాం

- బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని ఆశీర్వదించండి..
- అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా
- నగరంలోని 37వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



నగరంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 26: పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని గెలిపింపంచాలని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 37వ డివిజన్‌లోని మైసమ్మ మందిరం, కెనాల్ కట్ట వద్ద బాజిరెడ్డికి మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిగాల మాట్లాడుతూ.. బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. రాముడు కోసం లక్ష్మణుడిలా నిరంతరం శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రశ్నించే గొంతుకను గెలిపించుకోవడమే లక్ష్యమని, బాజిరెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 50 ఏండ్లలో జరగని అభివృద్ధి కేసీఆర్ హయాం లో పదేండ్లలో జరిగిందని గుర్తుచేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటల కరెంట్, సాగునీరందిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుమని పది రోజులు కాక ముందే కరెంట్ కట్‌చేస్తున్నదని విమర్శించారు. పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ప్రచారంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, డివిజన్ అధ్యక్షుడు ప్యాట సంతోష్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుజిత్‌సింగ్ ఠాగూర్, సత్యప్రకాశ్, నరేశ్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు
# 'స్వయం ప్రతిపత్తి'




బోధన్, ఏప్రిల్ 26: బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఢిల్లీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి అటానమస్ హోదా లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్ తెలిపారు. శుక్రవారం కళాశాలకు లభించిన హోదాపై విలేకరులతో మాట్లాడారు. కళాశాల భవనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యాబోధన అందిస్తున్న తమ కళాశాలకు ఎన్ఏసీ (బీ) గ్రేడ్ కల్పించిన కళాశాలల్లో బోధన్ కళాశాల ద్వితీయ స్థానంలో ఉందని చెప్పారు. మూడు మాధ్యమాల్లో విద్యాబోధన అందిస్తున్న ఏకైక కళాశాలగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. స్వయం ప్రతిపత్తితో అకడమిక్ సౌలభ్యం, స్థానిక అవసరాల దృష్ట్యా తామే 20% సిలబస్ మార్పునకు అవకాశం, ప్రత్యేక పరీక్షల విభాగాన్ని ఏర్పాటు చేసుకుని స్వయంగా పరీక్షల నిర్వహణ మెరుగైన ఫలితాలకు ఎంతో దోహదంగా ఉంటుందని తెలిపారు. కళాశాలకు 'అటానమస్ హోదా' రావడంపై కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సురేశ్, వైస్ ప్రిన్సిపాల్ రంగారత్నంను అభినందించారు.

# విషాదం నింపిన ప్రమాదం

- మల్లారం గండి వద్ద డీసీఎం బోల్తా పడి ఇద్దరు మృత్యువాత
- 15 మందికి గాయాలు.. దవాఖానలో చికిత్స

**కన్నీరుమున్నీరవుతున్న మృతుల కుటుంబీకులు**





మృతులు శ్యాంసుందర్, వసంత (ఫైల్)

మోర్తాడ్, ఏప్రిల్ 26: కందూరు చేద్దామని కమ్మర్‌పల్లి నుంచి వెళ్లిన ఓ రెండు కుటుంబాల్లో కొన్ని గంటల్లోనే తీవ్ర విషాదం నెలకొంది. వారు వెళ్తున్న వాహనం బోల్తాపడి ఇద్దరు మృత్యువాత పడగా.. మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి. కమ్మర్‌పల్లికి చెందిన రెంజర్ల స్వామి, రెంజర్ల నర్సయ్య పెద్దగుట్ట వద్ద కందూరు చేసేందుకు డీసీఎం వ్యాన్‌లో కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి మొత్తం 36 మంది గురువారం రాత్రి బయల్దేరారు. నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం గండి వద్ద డీసీఎం బోల్తా పడడంతో రెంజర్ల శ్యాంసుందర్(40), రెంజర్ల వసంత(30) సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. 15 మందికి గాయాలు కావడంతో వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలకు తరలించారు. పెద్దగుట్టకు వెళ్తూ ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడడంతో కమ్మర్‌పల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. దేవుడి దగ్గరకు వెళ్తూ ఇటువంటి సంఘటన జరగడం గ్రామంలో ఇదే మొదటిసారని స్థానికులు అన్నా రు. మృతుల ఇండ్ల వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. డీసీఎం డ్రైవర్ కమ్మర్‌పల్లిలోనే తాగి ఉన్నట్లు కనిపించాడని, తిరిగి ఆర్మూర్‌లో మరో మారు వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి తాగాడని మృతులు, క్షతగాత్రుల బంధువులు తెలిపారు.

**డీసీఎం డ్రైవర్‌పై కేసు నమోదు**

వినాయక్‌నగర్, ఏప్రిల్ 26: డీసీఎం డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా నడపడంతోనే ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరో 15 మంది గాయాలతో దవాఖానలో చేరారని నిజామాబాద్ రూరల్ ఎస్సై మహేశ్ తెలిపారు. ఈ ఘటనపై రెంజర్ల స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ ఆమందు కృష్ణ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### క్షతగాత్రులకు వేముల పరామర్శ



దవాఖానలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న వేముల

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 26 : రూరల్ మండలం మల్లారం గండి వద్ద జరిగిన ప్రమాదంపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారిని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో శుక్రవారం పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు. చనిపోయిన వారికి త్వరగా పోస్టుమార్టం చేయాలని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. చికిత్స పొందుతున్న బాధితులకు ధైర్యం చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చనిపోయిన వారికి ఆర్థిక సాయం అందించాలని వేముల కోరారు.